



నేత్రపర్వం

వైభవంగా వీరమ్మ తల్లి ఊయల ఉత్సవం

- తిరుగుగండ దీపాలతో దేదీప్యమానంగా వెలిగిన ఉయ్యూరు
- ప్రధాన రహదారిలోని ఆలయంలో కొలువుతీరిన అమ్మవారు

6లో

కరుణించు మేరీమాత

ఘనంగా గుణదల తిరునాళ్లు ప్రారంభం

మొదటిరోజు పోటెత్తిన భక్తులు



గుణదల కొండ వెలుగుల్లో భక్తుల ప్రత్యేక ప్రార్థనలు (ఇన్‌సెట్‌లో) మరియమాత

గుణదల మేరీమాత 101వ మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, వికర్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు తదితర గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అంతకుముందు గుణదల పురవీధుల్లో మేరీమాత తేరు ప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం కావడంతో ప్రార్థనామందిరంతో పాటు మేరీమాత గుహ, శిలువ మార్గంలో భక్తులు కిటకిటలాడారు.

6లో

అవే తప్పులు

భూముల రీసర్వేలో గ్రామ సర్వేయర్ల నిర్వాకాలు

టార్గెట్లు నిర్దేశించకున్నా హడావిడిగా పనులు

భూముల రీసర్వేలో మళ్లీ గత తప్పిదాలే చోటుచేసుకుంటున్నాయి. క్షేత్రస్థాయిలో సర్వేయర్ల నిర్లక్ష్యం, నిర్వాకాల కారణంగా సర్వే నెంబర్ల రీ ఫిక్సేషన్‌ను సరిగ్గా చేయట్లేదని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా కాకుండా, గ్రామ సర్వేయర్ల ఇష్టారాజ్యంగా రీసర్వే జరగటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

- సర్వేలో భూమి ఎక్కువగా తేలితే బేరాలు
- క్షేత్రస్థాయిలో పరిశీలన లేకుండానే లెక్కలు
- గూగుల్ మ్యాప్ ఆధారంగా అస్తవ్యస్తంగా..
- అర్జీలు పరిష్కారమయ్యాయని సంతకాలకు డిమాండ్
- లబోదిబోమంటున్న భూ యజమానులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని భూముల రీసర్వే కొత్త సమస్యలు తెచ్చి పెడుతోంది. గ్రామ సర్వేయర్లు బేరాలు పెట్టడం మొదలుపెట్టేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరపకుండా సర్వే నెంబర్‌ను, అందులోని సబ్ డివిజన్స్ పరిధిలోని భూములను పరిశీలించకుండా, కనీసం రైతులతో కూడా మాట్లాడకుండా పని కానిచ్చేస్తున్నారు. గూగుల్ మ్యాప్ ఆధారంగా ఓ అంచనాకు వచ్చి, ఆ భూమి నాలుగు వైపులా కొలతలు తీసుకుని రీసర్వే చేసేస్తున్నారు.

సమస్యలు ఇలా..

భూముల శిస్తుల కోసం బ్రిటీషు కాలంలో బీ నెంబర్లు ఇచ్చారు. 1925లో సరిహద్దు బౌండరీల చట్టం ఏర్పడ్డాక రీ సర్వే ప్రారంభమైంది. ఒక సర్వే నెంబర్‌లో గరిష్ఠంగా 20 ఎకరాల్లోపు ఉంటుంది. మాగాణి అయితే 10, మెట్ట అయితే 20 ఎకరాల్లోపు ఉంటుంది. రీ సర్వేలో ముఖ్యంగా సదరు సర్వే నెంబర్‌లో ఎంతమంది ఉన్నారు, విస్తీర్ణం ఎంత.. అనేది రీ ఫిక్సేషన్ చేయాలి. ఇది ఎంత సమర్థవంతంగా చేయగలిగితే రీసర్వే అంత చక్కగా ఉంటుంది. నిర్ణీత పరిమాణం కంటే భూమి ఎక్కువ ఉంటే.. ఆ సర్వే నెంబర్ పరిధిలోని వారికే తలా కొంత పంచుతూ సర్దుబాటు చేయాలి. కానీ, కొంతమంది సర్వేయర్లు ఆ మిగులు భూమిని వేరే సర్వే నెంబర్‌లోని వారికి కలపటానికి బేరాలు కుదుర్చుకుంటున్నారు. ఒకచోట ఉన్న ఎక్కువ భూమిని మరో సర్వే నెంబర్‌లోని తాను బేరం కుదుర్చుకున్న సబ్ డివిజన్ హోల్డర్‌కు కలిపితే రీసర్వేలో శాస్త్రీయత కనిపించదు. ఎక్కువ, తక్కువలు రావటానికి

మిగతా 6లో..

రైతులపై సర్వేయర్ల ఒత్తిడి

కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అడ్డగోలు సర్వేతో రైతుల భూములకు సంబంధించి చాలా వివాదాలు తలెత్తాయి. ఎన్టీఆర్ జిల్లాలోనే 3 వేల వరకు రైతుల నుంచి ప్రజా ఫిర్యాదుల వేదికకు ఫిర్యాదులు అందాయి. కృష్ణాజిల్లాలో పరిస్థితి కూడా అదే. మొత్తంగా 6 వేల వరకు అర్జీలు అందాయి. వీటి పరిష్కారం రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారింది. ఆరు నెలలుగా బాధితులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఏ ప్రయోజనం లేదు. కాగా, ఈ అర్జీలను పరిష్కరించాల్సిన అధికారులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. మీరు పెట్టిన అర్జీలు పరిష్కారమయ్యాయని సంతకం చేసి ఇవ్వాలంటున్నారు. ఇలా చేస్తే పెండింగ్ శాతాన్ని తగ్గించుకోవచ్చన్నది వీఆర్వోలు, సర్వేయర్ల అభిప్రాయం. కానీ, ఇలాంటి అర్జీలకు సంబంధించి కూడా రీసర్వే చేస్తే సమస్య పరిష్కారమవుతుంది. ఆ పని మాత్రం చేయట్లేదు. గ్రామానికో సర్వేయర్ ఉన్నా సమస్యను ఎందుకు పరిష్కరించటం లేదో అర్థంకాని పరిస్థితి. ఈ అంశాలపై రెండు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు సీరియస్‌గా దృష్టి సారించకపోతే రైతుల్లో అసంతృప్తి పెరిగే అవకాశముంది.

తిట్టుకో.. తన్నుకో..

పశ్చిమ వైసీపీలో రచ్చకెక్కిన విభేదాలు

వైసీపీ పశ్చిమ నేతల కోల్డ్‌వార్ ఒక్కసారిగా భగ్గుమంది. వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి ముందే వెలంపల్లి శ్రీనివాసరావు, షేక్ ఆసిఫ్ దాదాపు కొట్టుకునేంత వరకు వెళ్లారు. అరుపులతో మొదలై.. ఒకరినొకరు దూషించుకున్నారు. సుబ్బారెడ్డి సర్దుబాటు చేసే ప్రయత్నం చేసినా వీలు పడలేదు. దీంతో సయోధ్య సమావేశాన్ని అర్ధంతరంగా వాయిదా వేసి ఇద్దరినీ వెళ్లిపోమని పంపించేశారు.

- సయోధ్య సమావేశంలో వెలంపల్లి, ఆసిఫ్ తిట్ల దండకాలు
- వైవీ సుబ్బారెడ్డి వారించినా తగ్గలేదు
- తొలుత తిట్లు.. ఆ తర్వాత కొట్టుకునే వరకు..
- అర్ధంతరంగా ఆగిపోయిన సమావేశం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వైసీపీ నేతల మధ్య అంతర్యుద్ధం రచ్చకెక్కింది. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో అధికారపక్షంగా ఉన్న వైసీపీ కార్పొరేటర్లను కాపాడుకోవటానికి అధినేత జగన్ తాడేపల్లిలోని తన నివాసంలో విజయవాడ నగర నాయకులతో ఇటీవల సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ సమావేశానికి పశ్చిమ నియోజకవర్గంలో వైసీపీ తరఫున పోటీచేసి ఓటమి చెందిన షేక్ ఆసిఫ్ హాజరు కాలేదు. వెలంపల్లి శ్రీనివాసరావు ఏకపక్ష నిర్ణయాలు, దుందుడుకు వ్యవహారాలపై అంతకుముందే జగన్‌కు ఆసిఫ్ ఫిర్యాదు చేశారు. ఆసిఫ్ గైర్హాజరు కావడంతో ఇద్దరి మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సమావేశం నిర్వహించారు. ఇద్దరి మధ్య సయోధ్య కుదర్చాలని వైవీ సుబ్బారెడ్డికి జగన్ బాధ్యత అప్పగించారు.

తిట్ల పురాణం నుంచి తన్నుకునే వరకూ..

వెలంపల్లి శ్రీనివాసరావు, షేక్ ఆసిఫ్‌ను వైవీ సుబ్బారెడ్డి ఆదివారం తాడేపల్లి పిలిపించారు. వెలంపల్లి తన వెంట ఎమ్మెల్సీ రూహుల్లాను కూడా తీసుకెళ్లారు. ఆసిఫ్ మాత్రం ఒంటరిగానే వెళ్లారు. ఉదయం 11 గంటలకు మొదలైన సమావేశం మధ్యాహ్నం 3 గంటల వరకు సాగింది. సమావేశం మొదలైనప్పటి నుంచి వెలంపల్లి, ఆసిఫ్ మధ్య అరుపులు తప్ప మాటల్లేవు. తనకు పశ్చిమ నియోజకవర్గంలో ఏమాత్రం విలువ ఇవ్వటం లేదని తెలిపినట్టు తెలిసింది. దీనిపై వెలంపల్లి స్పందిస్తూ అందరినీ కలుపుకొనే వెళ్తున్నామని, సొంత కార్యక్రమాలు చేసుకుంటూ పార్టీకి దూరంగా ఉంటుంటే ఏం చేయగలమనడంతో వాదులాట ప్రారంభమైంది. ఈ గొడవ తిట్ల పురాణం అందుకునే స్థాయికి చేరింది. సుబ్బారెడ్డి వారించే ప్రయత్నం చేసినా వినలేదు. ఆసిఫ్ గట్టిగా ఎదురుదాడి చేస్తుండటంతో ఎమ్మెల్సీ రూహుల్లా కూడా జోక్యం చేసుకుని వెలంపల్లి తరఫున వాదించినట్టు సమాచారం. ఈ దశలో కొట్టుకునే పరిస్థితి రావడంతో సుబ్బారెడ్డి వారిని వారించే ప్రయత్నం చేశారు. చివరికి లాభం లేదని ఇద్దరిపై కోప్పడి బయటకు పంపించేశారు.

రైతు హత్య..?



శ్రీనివాసరావు (ఫైల్)

ములకలపెంటలో దారుణం

- భూ వివాదాలే కారణమా?

మైలవరం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొర్సుమిల్లి శివారు ములకలపెంటలో ఓ రైతు అనుమానాస్పదంగా మృతిచెందినట్లు మైలవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం ములకలపెంటకు చెందిన కడియం శ్రీనివాసరావు (57) శనివారం ఇంటికి రాకపోవడంతో, కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూశారు. ఆయన అక్కడ శవమై కనిపించడంతో హతాశులయ్యారు. గతంలో శ్రీనివాసరావు పొలంలో సుమారు 46 సెంట్లు పక్కనున్న రైతు పొలంలో కలిసినట్లు గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. అయినా పక్క రైతు పొలం ఇవ్వకపోవడంతో రెవెన్యూ సదస్సులో శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో ఇరు కుటుంబాల మధ్య వివాదాలు జరుగుతుండగా, శనివారం శ్రీనివాసరావు శవమై తేలడంతో ఇది హత్యేనంటూ ఆయన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మృతుడి శరీరంపై కత్తిపోట్లు కూడా ఉండటంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కాగా, ఆదివారం ఉదయం ఇద్దరు అనుమానితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోస్టుమార్టం నిమిత్తం శ్రీనివాసరావు మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యం మార్గం

మద్యం షాపులే టార్గెట్‌గా వరుస చోరీలు

- తొలుత వన్‌టౌన్.. తర్వాత మంగళగిరి..
- తాజాగా బెంజిసర్కిల్ వద్ద..
- కౌంటర్లను కొల్లగొడుతున్న దొంగలు
- చడ్డీలు వేసుకుని, ముసుగులతో దొంగతనాలు

పగలంతా ఎక్కడ ఉంటారో తెలియదు. ఎక్కడెక్కడ తిరుగుతారో తెలియదు. చీకటి పడుతున్న సమయంలో రహదారులను వెతుక్కుంటూ బయటకొస్తారు. ఎక్కడ మద్యం దుకాణం కనిపిస్తే అందులోకి దూకుతారు. కౌంటర్లను ఖాళీ చేస్తారు. కొద్దిరోజులుగా వరుసగా ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో మద్యం దుకాణాల్లో సాగుతున్న చోరీల తీరిది. విజయవాడ, మంగళగిరి ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ చోరీలు జరుగుతున్నాయి. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో దుకాణాల్లోని కౌంటర్లను కొల్లగొడుతున్నారు. జనవరి 31 నుంచి శనివారం అర్ధరాత్రి వరకు జరిగిన ఘటనలకు సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీలు ఈ విషయాలను తెలియజేస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ముఖానికి ముసుగు.. శరీరం నిండా నూనె.. అండర్‌వేర్ మాత్రమే వేసుకుని ఉన్న వీరిని చూస్తే చడ్డీగ్యాంగ్ గుర్తొస్తుంది. రెండేళ్ల క్రితం చడ్డీగ్యాంగ్ నగరంలో వరుసగా అపార్ట్‌మెంట్లలో చోరీలకు దిగగా, పోలీసులు మధ్యప్రదేశ్‌కు వెళ్లి అక్కడి నుంచి కొంతమంది చడ్డీగ్యాంగ్ సభ్యులను లాక్కొచ్చారు. ఇప్పుడు అదే పోలికలతో ఉన్న నిందితులు మద్యం షాపుల్లో చోరీలకు దిగుతున్నారు. మద్యం దుకాణాలకు పక్కన ఉండే చిన్నచిన్న సందుల్లోకి వెళ్లి షాపు పైభాగాన ఉండే రేకును కట్ చేస్తున్నారు. ఆ కన్నం నుంచి నెమ్మదిగా షాపులోకి దిగుతున్నారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న మొత్తాన్ని ఒక కవర్‌లో వేసుకుంటున్నారు. కౌంటర్లకు తాళాలు వేసి ఉంటే పగలగొడుతున్నారు.

బెంజిసర్కిల్ వద్ద మద్యం షాపులో చోరీ

శనివారం అర్ధరాత్రి బెంజిసర్కిల్ వద్ద ఉన్న మద్యం షాపులోకి ఓ వ్యక్తి ఇలాగే ప్రవేశించాడు. జనవరి 31న సితార సెంటర్, మంగళగిరిలో ఉన్న మద్యం దుకాణాల్లోకి ఈ విధంగా దిగారు. ఈ మూడు షాపుల్లో చోరీ చేసిన



సితార సెంటర్, బెంజిసర్కిల్ వద్ద చోరీ దృశ్యాలు

వ్యక్తుల అవతారాలు ఒకేలా ఉన్నాయి. ఈ ముగ్గురు ఒకే గ్యాంగ్‌గా ఉంటున్నారన్న అనుమానం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు చోరీలు జరిగిన షాపుల్లోకి నిందితులు సరిగ్గా అర్ధరాత్రి 1-2 గంటల మధ్య దిగినట్టు సీసీ కెమెరాల్లోని ఫుటేజీని బట్టి తెలుస్తోంది. బెంజిసర్కిల్ మద్యం షాపులోని కౌంటర్ నుంచి రూ.20 వేలు దొంగిలించారు. సితార సెంటర్ వద్ద జరిగిన చోరీలోనూ ఇంతే మొత్తాన్ని చోరీ చేశారు. మంగళగిరిలోని మద్యంషాపు నుంచి

మిగతా 6లో..

గీత షాపులకు 621 దరఖాస్తులు

- ఎన్టీఆర్‌లో 335..కృష్ణాకు 286
- షాపుల కేటాయింపు డ్రా వాయిదా
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

6లో



నాట్యమయూరాలై..

ముగిసిన సిద్ధేంద్రయోగి జయంత్యుత్సవాలు


ఊరేగుతున్న వీరమ్మ, గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా వీరమ్మ గ్రామోత్సవం

● మెట్టినింటి నుంచి ఆలయానికి చేరిన అమ్మవారు

ఉయ్యూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వీరమ్మతల్లి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రావిచెట్టు సెంటర్ సమీపాన మెట్టినింటి నుంచి శనివారం రాత్రి బయలుదేరిన అమ్మవారు మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ, తిరుగు గండదీపాల భక్తులు వేలాది మంది వెంట రాగా పురవీధుల్లో ఊరేగారు. అమ్మవారికి దీపారాధన చేసి, పసుపు కుంకుమ అందించి, పల్లకీ వెంట వేలాది భక్తులు నడిచారు. గ్రామోత్సవం అనంతరం ఊయల స్తంభాల వద్ద ఊయలలూగి ప్రధాన రహదారిపై ఉన్న ఆలయానికి ఆదివారం రాత్రికి అమ్మవారు చేరుకున్నారు.

నేత్రపర్వం

ఉయ్యూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మతల్లి ఊయల ఉత్సవం భక్తజనసందోహం నడుమ ఆదివారం నేత్రపర్వంగా సాగింది. 15 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి మెట్టినింటి నుంచి బయలుదేరిన అమ్మవారు నగర వీధుల్లో వైభవంగా ఊరేగి ప్రధాన సెంటర్ సమీపంలోని ఊయల స్తంభాల వద్దకు చేరుకున్నారు. కన్నుల పండువగా ఊయల ఉత్సవం జరుపుకొన్నారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఉయ్యూరు జనసంద్రంగా మారింది. ప్రధాన సెంటర్‌తో పాటు అమ్మవారి ఆలయం, కాటూరు రోడ్డు, బస్టాండ్ రోడ్లు కిక్కిరిశాయి. తిరుగుగండ దీపాలతో ఉయ్యూరు దేదీప్యంగా వెలిగింది. ఊయల ఉత్సవం అనంతరం అమ్మవారు ప్రధాన రహదారిలోని ఆలయంలో కొలువుతీరారు. అక్కడి నుంచి భక్తులకు దర్శనమిస్తున్నారు.

తొక్కిసలాట.. త్రుటిలో తప్పిన ప్రమాదం

ఊయల ఉత్సవంలో తొక్కిసలాట జరగగా, త్రుటిలో పెద్దప్రమాదం తప్పింది. ఈ ఘటనలో పలువురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. అమ్మవారి పల్లకీ ఊయల స్తంభాల వద్దకు వస్తున్న తరుణంలో పోలీసుల రోప్‌వే వైపు నుంచి కాకుండా బారికేడ్లు ఉన్న వైపు నుంచి భక్తులు ఒక్కసారిగా రావడంతో తోపులాట జరిగింది. బారికేడ్ల కిందపడి మహిళలు గాయపడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు కిందపడిపోయిన వారిని లేపి పరిస్థితి చక్కదిద్దారు.


గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల 1971-1978 బ్యాచ్

అపూర్వ సమ్మేళనం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల(1971-1978 బ్యాచ్) పూర్వ విద్యార్థుల సంఘం 'మిత్రమా స్వాగతం'(మిస్వా) ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో వారి కుటుంబసభ్యులతో సహా సమావేశమైంది. యాభై మూడేళ్ల స్నేహానికి గుర్తుగా నాటి తీపి జ్ఞాపకాలను వారంతా గుర్తుచేసుకున్నారు. అప్పటి ఆంగ్ల అధ్యాపకుడు చిరుమామిళ్ల సాంబశివరావును సత్కరించారు. మిస్వా వేదిక ద్వారా సామాజిక కార్యక్రమాల్లో భాగమవుతామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల మల్లికార్జునరావు(న్యూఢిల్లీ) ప్రకటించారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు తోట నరేంద్రదేవ, మేరుగ శివాజీ, మెన్నా వల్లభరావు, కేవీఎస్ఎన్ మూర్తి, పువ్వుల సుధాకర్, వెలిచేటి సత్యనారాయణ పాల్గొన్నారు.


జీవీజే బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి 1974-1975 బ్యాచ్

ఉల్లాసంగా..ఉత్సాహంగా

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జీవీజే బాలుర ఉన్నత పాఠశాలలో 1974-1975లో పదో తరగతి చదువుకున్న వారంతా పట్టణంలోని ఉక్కు కళావేదికలో సమావేశమై ఆదివారం ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. పాఠశాల స్థల దాత గెంటేల వెంకటజోగయ్య ముని మనవడు పార్థసారథి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. యాభై ఏళ్ల క్రితం చదువకున్న వారంతా ఇలా కలుసుకోవటం చరిత్రాత్మకమని, వారి చిరునామాలు గుర్తించి, సమీకరించిన నిర్వాహకులు అభినందనీయులు అని మాజీ ఎంఈవో వెంకటేశ్వరశర్మ, ప్రస్తుత హెచ్ఎం మాధవీలత అన్నారు. అమెరికా నుంచి ఈ సమావేశానికి విచ్చేయడం వారి స్నేహశీలతకు దర్పణమన్నారు. పూర్వ విద్యార్థులందరికీ వారి పేరు, ఫొటోతో మెమెంటోను నిర్వాహకులు అందించారు. పసుపుల పుల్లారావు(ఇల్లెందు), మెరిశెట్టి రంగారావు, వీరవల్లి శ్రీనివాసరావు, నాగళ్ల రాజా, ఎన్.ధనమూర్తి, పబ్బిశెట్టి థాండస్, న్యాయవాది గోనెల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అవే తప్పులు..!

(5వ పేజీ తరువాయి)

దోహదపడుతుంది. భవిష్యత్తులో ఇది సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి సర్వేయర్లు సర్వే నెంబర్ల ప్రాతిపదికన కాకుండా ఆ గ్రామ ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్ (ఎఫ్ఎంబీ) ఆధారంగా రీ ఫిక్సేషన్‌ను సక్రమంగా చేపట్టాలి. అలాగే, కొన్ని సర్వే నెంబర్లలో భూమి తక్కువగా చూపించే అవకాశముంది. పూర్వం రోజుల్లో గొలుసులతో కొలవటం వల్ల అంత ప్రామాణికంగా సర్వే జరగకపోయి ఉండొచ్చు. కాల్వగట్లను, ఇతర పోరంబోకులను కూడా కలుపుకొని అప్పట్లో మాన్యువల్ విధానంలో ఎక్కువగా నమోదు చేయించుకుని ఉండొచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఎక్కువ, తక్కువలు తప్పకుండా వస్తాయి. ఎక్కువ వస్తే బేరాలు పెట్టుకుని వేరే సర్వే నెంబర్ల వారికి కలిపి చూపటం, తక్కువ వస్తే వారికి అర్థమయ్యేలా చెప్పకపోవటం వంటి అంశాలు ప్రస్తుతం రీసర్వేలో ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ఆరోజు ఎంతమందికి రీసర్వే పూర్తి చేశామని సర్వేయర్లు ఆలోచిస్తున్నారే కానీ, గ్రామం అనే పరిధిని దృష్టిలో ఉంచుకుని నిర్వహించటం లేదన్న విమర్శలు భూ యజమానుల నుంచి వస్తున్నాయి. సర్వే నెంబర్ల రీ ఫిక్సేషన్ సక్రమంగా జరగకపోతే పోరంబోకు భూములు అన్యాక్రాంతమయ్యే పరిస్థితి ఉంది.

మద్యం మార్గం

(5వ పేజీ తరువాయి)

మాత్రం రూ.3 లక్షలు తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే, వీరు చడ్డీగ్యాంగ్‌కు సంబంధించిన వారు కాదని పోలీసులు చెబుతున్నారు. మద్యం షాపుల్లో ఇప్పటివరకు జరిగిన చోరీలన్నీ స్థానిక దొంగల పనేనంటున్నారు. చడ్డీగ్యాంగ్ ఈ చోరీలు చేసిందని దృష్టిని మళ్లించడానికే ఇలా చేస్తున్నారని పోలీసులు పేర్కొంటున్నారు. వాస్తవానికి చడ్డీగ్యాంగ్‌లోని వ్యక్తులు ముఖానికి ముసుగు ధరించి, అండర్‌వేర్ వేసుకుని, ఒంటికి నూనె గానీ, గ్రీజు గానీ రాసుకుంటారు. వారి చేతులకు గ్లౌజ్‌లు ఉంటాయి. తాజాగా మద్యం దుకాణాల్లో జరిగిన చోరీల్లో ఫుటేజీలను పరిశీలిస్తే.. ఈ దొంగలకు గ్లౌజ్‌లు లేకపోవడంతో పోలీసు వర్గాలు స్థానికతను పరిగణనలోకి తీసుకుంటున్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి గుణదల మహోత్సవాలు ప్రారంభిస్తున్న విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు


ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు, భక్తులతో కిటకిటలాడుతున్న గుణదల పుణ్యక్షేత్రం పరిసరాలు



అంగరంగ వైభవంగా..

గుణదల లూర్దుమాత 101వ మహోత్సవాలు ప్రారంభం

గుణదల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): 'మరియమాతకు కష్టాలు, బాధలు విన్నవించుకుంటే ఆమె ప్రార్థనను దేవుడు ఆలకించి మన సమస్యలు తొలగిస్తారు. భక్తులను దేవుని మార్గంలో నడిపించడానికి మరియ మాత అనేక ప్రాంతాల్లో దర్శనమిచ్చారు.' అని విజయవాడ కతోలిక పీఠం బిషప్ మోస్ట్ రెవరెండ్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. గుణదల కొండపై కొలువైన లూర్దు మాత 101వ మహోత్సవాలు ఆదివారం ఉదయం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7గంటలకు బిషప్ గ్రాసీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళావేదికపై బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, వికర్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు తదితర గురువులు జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. 2025 సంవత్సరాన్ని జగద్గురువు పరిశుద్ధ పోప్ ఫ్రాన్సిస్ జూబ్లీ సంవత్సరంగా ప్రకటించారని బిషప్ భక్తులకు సందేశమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన పూజాపీఠంపై స్వర్ణ జూబిలేరియన్ ఫాదర్ పి.కె.జోసఫ్‌తో కలిసి బిషప్ జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ ఎం.గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, ఎడ్యుకేషన్ డెస్క్ డైరెక్టర్ కొలకాని మరియప్ప, ఎస్ఎస్‌సి డైరెక్టర్ తోట సునీల్ రాజు, డయాసిస్‌కు చెందిన గురువులు ప్రారంభ పవిత్ర దివ్యపూజాబలి సమర్పించారు. పూజ


దివ్యపూజాబలి సమర్పిస్తున్న గురువులు

అనంతరం గురువులు మువ్వల ప్రసాద్, పల్లె జోజి బాబు పసల తోమస్ తదితరులు కతోలిక క్రైస్తవ భక్తులకు దివ్య సత్ప్రసాదం అందజేశారు.

పురవీధుల్లో మేరీమాత తేరు ప్రదక్షిణ

గుణదల పురవీధుల్లో మేరీమాత తేరు ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ ప్రారంభించారు. మేరీమాత ఆశీస్సులు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నారు. తేరు ప్రదక్షిణ ప్రధాన చర్చి నుంచి ప్రారంభమై గంగిరెద్దుల దిబ్బ, గాంధీబొమ్మ సెంటర్, గుణదల సెంటర్, ఏలూరు రోడ్డుమీదుగా లూర్దునగర్, బెత్లహామ్‌నగర్‌ల నుంచి తిరిగి చర్చి వద్దకు చేరుకుంది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మేరీమాత ప్రతిమను ఉంచి భక్తిగీతాలు ఆలపిస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెక్టర్ యేలేటి విలియం జయరాజు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు నిర్మలా కుమారి, మాధురి, అంబేడ్కర్ పాల్గొన్నారు.


తేరు ప్రదక్షిణను ప్రారంభిస్తున్న దేవినేని అవినాశ్


మోకాళ్లపై నడిచి వెళుతున్న భక్తులు


కొవ్వొత్తులు వెలిగిస్తున్న క్రైస్తవులు


కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు

బందోబస్తు పర్యవేక్షించిన సీపీ

గుణదల: మేరీమాత ఉత్సవాల బందోబస్తును నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు పర్యవేక్షించారు. ఆదివారం మధ్యాహ్నం గుణదలలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ వద్దకు చేరుకుని ఎల్‌సీడీ టీవీల ద్వారా రద్దీగా ఉన్న ప్రదేశాలను గుర్తించారు. డ్రోన్ కెమెరాలు, ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరుపై దృష్టి సారించారు. ఏలూరు రోడ్డులో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవాలని ఏసీపీ దామోదర్‌ను ఆదేశించారు. ప్రధాన చర్చి, కొండ మధ్యలో మేరీమాత గుహ, కొండ శిఖరాగ్రానగల యేసుక్రీస్తు శిలువ వద్ద భక్తుల దర్శనాలు ఆలస్యం కాకుండా చూడాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. భక్తులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. డీసీపీ గౌతమి షాలి, ట్రైనీ ఐపీఎస్ మనీషా, సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్, ఏడీసీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నాట్యమయూరాలై..

● ముగిసిన సిద్ధేంద్ర యోగి జయంత్యుత్సవాలు


సత్యానందిని, రమ్య సాహితీల అభినయం


మనీషా-శ్రీనిజల యుగళ నర్తనం

కూచిపూడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సిద్ధేంద్ర యోగి జయంత్యుత్సవాల్లో భాగంగా అఖిలభారత కూచిపూడి నాట్య కళా మండలి ఆధ్వర్యంలో కూచిపూడి సిద్ధేంద్ర యోగి కళావేదికపై రెండు రోజులుగా ప్రదర్శిస్తున్న కూచిపూడి నాట్యాంశాలు నాట్యపరిమళాలను వెదజల్లి ఆదివారం రాత్రితో ముగిశాయి. ముగింపు రోజున విజయవాడకు చెందిన నాద పద్మ నారాయణ తీర్థుల తరంగం అంశాన్ని ప్రదర్శించి నాట్యాంశాలకు శ్రీకారం చుట్టారు. కొత్తగూడేనికి చెందిన శ్రీ దుర్గాసాయి నృత్య కళానికేతన్ విద్యార్థులు మనీషా, శ్రీనిజలు యుగళ నర్తనంలో చూపిన హావభావాలు అబ్బురపరిచాయి. నందిపల్లి సాహితీ అలోకయే శ్రీ బాలకృష్ణం అంశాన్ని ప్రదర్శించి రంజింపజేశారు. విజయవాడకు చెందిన శ్రీ సత్యకళానిలయం విద్యార్థులు సత్యానందిని, రమ్యసాహితీలు శ్రీ శంకరగిరి నాదప్రభో, కూచిపూడి వైభవం అంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆనందడోలికల్లో ముంచెత్తారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ లలితా స్కూల్ ఆఫ్ డ్యాన్స్ విద్యార్థులు లలితా సింధురి, రిత్విక, తన్వి, రితికలు సరస్వతీ స్తుతి, రామాయణ శబ్దం, రుక్మిణి ప్రవేశ దరువు, అష్టలక్ష్మీ స్తోత్రం, దశవతార హారతి అంశాలు ప్రదర్శించి ఆద్యంతమూ భక్తిభావంలో ముంచెత్తారు. అతిథులను, కళాకారులను నిర్వాహకులు వేదాంతం రాధేశ్యామ్, మృత్యుంజయ శర్మ, హరనాథ శాస్త్రిలు మెమెంటోలు అందించి సత్కరించారు.


కనకదుర్గమ్మ సన్నిధిలో నటుడు అక్కినేని నాగచైతన్య, తండేల్ చిత్ర బృందం

దుర్గమ్మ సేవలో అక్కినేని నాగచైతన్య

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తండేల్ సినిమా కథానాయకుడు అక్కినేని నాగచైతన్య, చిత్ర బృందంతో కలిసి ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీస్సులు అందించారు. అమ్మవారి లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాలను అధికారులు అందజేశారు. చిత్ర నిర్మాత బన్నీ వాసు, దర్శకుడు మొండేటి చందు అమ్మవారిని దర్శించుకున్నారు.

సర్వేశ్వరరావుకు పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న ఆల్ ఇండియా అక్కినేని నాగార్జున యువసేన అధ్యక్షుడు ఎస్.సర్వేశ్వరరావును ఆదివారం విజయవాడ సూర్యారావుపేటలోని ఆయన నివాసంలో నాగచైతన్య పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గీత షాపులకు 621 దరఖాస్తులు

● ఎన్టీఆర్ జిల్లాలో 335..కృష్ణాకు 286

● షాపుల కేటాయింపు డ్రా వాయిదా

● ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

ఎన్టీఆర్ జిల్లాలో..		కృష్ణా జిల్లాలో..	
విజయవాడ	71	మచిలీపట్నంకార్పొరేషన్	40
జగ్గయ్యపేట	21	గుడివాడమున్సిపాలిటీ	32
కొండపలి	47	పెడనమున్సిపాలిటీ	13
వీరులపాడు	27	తాడిగడపమున్సిపాలిటీ	60
వత్సవాయి	31	గూడూరు	17
తిరువూరు	20	గుడివాడ	15
ఎ.కొండూరు	31	పడిమిముక్కల	30
నందిగామ	31	పెడన	16
రెడ్డిగూడెం	18	మచిలీపట్నం	16
విస్సన్నపేట	16	కోడూరు	14
జగ్గయ్యపేట రూరల్	22	పెదపారుపూడి	11
		బంటుమిల్లి	22
	---		---
మొత్తం	335	మొత్తం	286

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) ఉమ్మడి కృష్ణాజిల్లాలో గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఎన్టీఆర్ జిల్లాలో 11, కృష్ణాజిల్లాలో 12 రిజర్వేషన్ షాపులకు కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ షాపులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లాలో 11 షాపులకు 335, కృష్ణాజిల్లాలో 12 షాపులకు 286 దరఖాస్తులు అందాయి. అత్యధిక దరఖాస్తులు విజయవాడ కార్పొరేషన్‌లోని షాపునకు వచ్చాయి. ఈ షాపునకు 71 దరఖాస్తులు అందాయి. కృష్ణా జిల్లాలో తాడిగడప మున్సిపాలిటీ షాపునకు 60 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ఈ షాపులను గీత కార్మిక కులాల్లో ఉన్న గౌడ, శెట్టిబలిజ వర్గాలకు కేటాయించారు. శెట్టిబలిజ సామాజిక వర్గానికి కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, ఎన్టీఆర్ జిల్లాలో విస్సన్నపేటలో షాపులను రిజర్వ్ చేశారు. మిగిలిన షాపులను గౌడ సామాజిక వర్గానికి కేటాయించారు. ఈ దరఖాస్తులు పరిశీలించిన అనంతరం ఈనెల పదో తేదీన లాటరీ ద్వారా షాపులను కేటాయించాల్సి ఉంది. దీనిపై ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రభావం పడింది. కోడ్ అమల్లో ఉన్నందున పదో తేదీన నిర్వహించాల్సిన లాటరీని వాయిదా వేస్తున్నట్టు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. తదుపరి డ్రా తేదీని త్వరలో తెలియజేస్తామని స్పష్టం చేశారు.

లడ్డూ ప్రసాదంలో కేశం ఉందని మంత్రి రామనారాయణరెడ్డికి ఎక్స్‌లో పోస్టు

● తయారీకేంద్రంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్, దేవస్థానం డిప్యూటీ ఈవో తనిఖీ

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో వారం క్రితం ఒక భక్తుడు లడ్డూ ప్రసాదం కొనుగోలు చేసి దానిని స్వీకరించడానికి ప్రయత్నం చేయగా అందులో కేశం కనిపించడంతో దీనిపై సమాచార కేంద్రంలో ఫిర్యాదు చేశాడు. అదే విషయాన్ని దేవదాయ మంత్రికి ఎక్స్‌లో ఫొటోతో సహా పోస్టు చేశాడు. దీనిపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. జరిగినదానికి క్షమించండి, ఇలాంటి తప్పులు మరోసారి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం, లడ్డూ తయారీ కేంద్రాన్ని స్వయంగా పరిశీలిస్తానని, పవిత్రత దెబ్బతినకుండా చూస్తామని శనివారం బదులిచ్చారు. దీంతో ఆదివారం దేవస్థానం డిప్యూటీ ఈవో, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు లడ్డూ తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.

ముగిసిన హాస్య నాటిక పోటీలు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మనసుకు ఉల్లాస, ఉత్తేజాలను కలిగిస్తూ మూడు రోజులుగా నిర్వహిస్తున్న హాస్య నాటికల పోటీలు ముగిశాయి. సుమధుర కళానికేతన్ 51వ వార్షికోత్సవం, 27వ తెలుగు హాస్యనాటికల మూడో రోజు పోటీలు ఆదివారం సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఉదయం నాట్యరంగంలో విశేష ప్రతిభకల లేఖ్యభరణి, సాయి వర్షితవర్మ, శృతి సమన్వి, అజయ్ బృందం నాట్యతరంగాలతో అలరించారు. గుడిపాటి శ్రీలలిత, భమిడిపాటి రాజశేఖర్, రసూల్ బాబు, సాత్విక శ్రీజ, ప్రణీతలు పాడుతా తీయగా అంటూ మధురగానాన్ని వినిపించారు. చెర్రీ, పిండిప్రోలు కృష్ణకుమారి బృందం వాద్య గోష్ఠి ఉల్లాసాన్ని కలిగించాయి. సాయంత్రం పోటీల్లో యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారితో ప్రేమపిచ్చి గోపీ వల్లభ నాటికను వాసుదేవరావు దర్శకత్వంలో ప్రదర్శించారు. చివరిగా మల్లాది రవికిరణ్ రచనలో, మంజునాథ్ దర్శకత్వంలో ఆవేశంలో ఆనందం నాటిక ప్రదర్శించి నవ్వించారు. యువ కళాకారులను ప్రోత్సహిస్తూ పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులతో పిన్నమనేని మృత్యుంజయరావు రచన, వాసు దర్శకత్వంలో కదం కదం పర్ నాటికను ప్రదర్శించారు. సభలో హాస్యబ్రహ్మ జంధ్యాల స్మారక పురస్కారాన్ని, సినీ, రంగస్థల నటులు సుబ్బరాయశర్మకు బహూకరించి సత్కరించారు. హాస్య నాటికల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, లలిత ప్రసాద్(సిద్ధార్థ కళాపీఠం), దారా సత్యనారాయణశర్మ, డి.రామకోటేశ్వరరావు, పిన్నమనేని మురళీకృష్ణ(జామవా సాంస్కృతిక వేదిక), కోనేటి సుబ్బరాజు, దొంతిరెడ్డి వేమారెడ్డి, రావి వెంకటరావు (ఛైర్మన్, ఎన్ఆర్ఐ), సంస్థ బాధ్యులు ఎంసీ దాసు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి పెద్దేశ్వర్ హెల్త్‌కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు సత్యకుమార్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే కామినేనిశ్రీనివాస్, పల్లెం పెద్దేశ్వరరావు తదితరులు

అత్యాధునిక వైద్య సౌకర్యాలతో బహుళ ప్రత్యేకతల

పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభం

వన్‌టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వైద్య సౌకర్యాలతో బహుళ ప్రత్యేకతల పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్‌ను ప్రారంభించడం హర్షదాయకమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడలో స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మల్టీ స్పెషాలిటీ ట్రామా, క్రిటికల్ కేర్ సెంటర్‌గా రూపొందించిన పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి వెలిగించారు. ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అందుకు అనుగుణంగా హెల్త్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, ఎన్టీఆర్ వైద్యసేవలను వివరించారు. ప్రజలకు తక్కువ వ్యయంతో కార్పొరేట్ వైద్యసేవలు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. పాతికేళ్లుగా తక్కువ వ్యయంతో వైద్యసేవలు అందిస్తున్న పెద్దేశ్వరరావును మంత్రి అభినందించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద క్రిటికల్ కేర్ సెంటర్‌ను ప్రారంభించామని, ప్రజలకు మరింత విస్తృతంగా సేవలు అందిస్తామని ఎండీ పల్లెం పెద్దేశ్వరరావు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో క్రిటికల్ కేర్‌సెంటర్‌ను ఏర్పాటు చేశామని, 150 బెడ్లు, 8 ఐసీయూలు, 100 క్రిటికల్ కేర్ బెడ్లు ఇంకా ఇతర విభాగాలు ఉన్నాయని సీఈవో డాక్టర్ పల్లెం ఆకాశ్ వివరించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, కామినేని శ్రీనివాస్, స్టార్ ఆస్పత్రి ఎండీ మన్నవ గోపీచంద్, వైద్యులు సీహెచ్ ప్రసాద్‌బాబు, ఎస్.భాను ప్రభాకర్, వి.సుశాంత్‌రెడ్డి, సింధు చాగంటి, పోతుల పవన్‌సాయి, కె.శ్రీనివాసబాబు, కొనకళ్ల రామ్‌ప్రతాప్, కె.రామ్మోహన్ పాల్గొన్నారు.

12న కస్టమ్స్ వాకథాన్

విజయవాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం సందర్భంగా 12న 5కే రన్, వాక్‌థాన్ నిర్వహిస్తున్న కస్టమ్స్ కమిషనర్ ఎస్.నరసింహారెడ్డి తెలిపారు. ఆటోనగర్‌లోని కస్టమ్స్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఆరోగ్యమైన జీవనశైలి, ప్రపంచ వాణిజ్యాన్ని సులభతరం చేయడంలో కస్టమ్స్ పోషించే పాత్రపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంజీ రోడ్డులోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం ఆరు గంటలకు ప్రారంభమవుతుందన్నారు. వివిధ వయో వర్గాలకు అనుగుణంగా రన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కస్టమ్స్ ఉద్యోగులే కాకుండా, వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొనవచ్చని తెలిపారు. కస్టమ్స్ అదనపు కమిషనర్ కాకరాల ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

మీకోసం పోర్టల్‌లో అర్జీలు నమోదు చేసుకోండి

● ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచన

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో ఎన్టీఆర్ జిల్లాలో కోడ్ అమల్లో ఉన్న కారణంగా సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించామని కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ప్రతి సోమవారం కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రస్సల్ సిస్టం కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించామని పేర్కొన్నారు. ప్రజలు మీకోసం ఆన్‌లైన్ పోర్టల్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చని, ఇందుకు సమీప గ్రామ లేదా వార్డు సచివాలయాన్ని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

ఈనెల 22, 23న ఉచిత పుస్తకాల పంపిణీ

ఆటోనగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో 9 ఏళ్లుగా ఉచిత పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని, ఈనెల 22, 23 తేదీల్లో బెంజిసర్కిల్ సమీపంలోని సర్వోత్తమ గ్రంథాలయంలో పుస్తకాలను పంపిణీ చేస్తామని సంఘ ప్రధాన కార్యదర్శి రావి శారద ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సూమారు 35 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు, సాహితీప్రియులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.


ల్యాప్‌ట్యాప్ అందిస్తున్న ఎస్.వినోద

పేద విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేత

పటమట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చదువుతున్న అమలాపురానికి చెందిన టి.జాహ్నవిబీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. తండ్రి లేని పేద విద్యార్థికి రూ.65 వేలు విలువగల ల్యాప్‌ట్యాప్‌ను నిర్భయ క్రాంతి మహిళా మండలి కార్యాలయంలో ఆదివారం మహిళా మండలి సభ్యురాలు ఎస్.వినోద తన సొంత నిధులతో కొను గోలు చేసి అందజేశారు. కార్యక్రమంలో మహిళా మండ లి అధ్యక్షురాలు అబ్బూరి రత్న లక్ష్మీ, ఉపాధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న గురువులు


ప్రదర్శనలో పాల్గొన్న భక్తులు


తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

లోకమాతకు వందనం

గుణదల కొండపై కొలువైన గుణదల(లూర్దు)మాత 101వ మహోత్సవాలు ఆదివారం ఉదయం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులను దేవుని మార్గంలో నడిపించడానికి మరియమాత అనేక ప్రాంతాల్లో దర్శనమిచ్చారు. ఆమెకు వందనం.' గుణదల పురవీధుల్లో మేరీమాత తేరు ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.తేరు ప్రదక్షిణకు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మేరీమాత ప్రతిమను ఉంచి మేళతాళాలతో భక్తిగీతాలు ఆలపిస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


భక్తులను ఆశీర్వదిస్తున్న గురువులు


ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు


చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు


ఉపదేశం చేస్తున్న గురువులు

నైతిక విలువల సమాజమే లక్ష్యం

ఆటోనగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : నైతిక విలువలతో కూడిన సమాజ ఏర్పాటుకు దైవ గ్రంథాల విద్య అవసరం ఎతైనా ఉందని ఏటీపీ అధ్యక్షుడు రాజనాల వెంకట రమణారావు అన్నారు. ఆటోనగర్‌లోని ఏటీపీ హాలులో ఆదివారం 10వ రాష్ట్ర స్థాయి ఖురాన్ కంఠస్థ ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న వెంకటరమణరావు మాట్లాడుతూ చెడు అలవాట్లు, అరాచకాలు, నేరాలు చిన్న పిల్లల్లోనూ పెరిగిపోతున్న తరుణంలో నైతిక విలువలతో కూడిన దైవ గ్రంథాల విద్య అవసరం ఉందన్నారు. యూఎఫ్‌క్యూఎస్ సంస్థ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడానికి దివ్య ఖురాన్ కంఠస్థ పోటీల్లాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. పది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని ఆదరిస్తున్న తల్లిదండ్రులకు, సహకరిస్తున్న అందరికీ కృతజ్ఞతలని యూఎఫ్‌క్యూఎస్ చైర్మన్ దావూద్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల మంది దరఖాస్తు చేసుకోగా 44 మంది ఫైనల్‌కు చేరుకున్నారని తెలిపారు.

రోగాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించాలి


రోగులకు పరిక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుణదల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎటువంటి రోగాన్ని అయినా ప్రాథమిక దశలోనే పసిగట్టి వైద్యుని సలహా సూచనల మేరకు ఆహారం, మందులు వాడుతే ప్రాణాపాయం ఉండదని హెచ్‌సీజీ క్యేన్సర్ ఆసుపత్రి ప్రతినిది అంజిబాబు అన్నారు. ఒకటో డివిజన్ పరిధిలోని హెచ్‌సీజీ క్యేన్సర్ ఆసుపత్రి, మాచవరం వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. గర్భాశయ పరీక్షతోపాటు పలు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. మాచవరం, గుణదల పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన 120 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తున్నాయని, తద్వారా చాలా మంది అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంట్లో తయారు చేసిన ఆహారం ఎంతో శ్రేష్టం అన్నారు. బయట ఏదో తప్పని సరైనప్పుడు తప్ప ఇతర సమయాల్లో ఇంటి ఆహారం తీసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనారోగ్యం బారిన పడ్డ తర్వాత శ్రద్ధ తీసుకోవడం కాదని ప్రతి ఒక్కరూ వారి వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడంతోపాటు శరీరానికి వ్యాయామం కూడా చాలా అవసరమన్నారు. మాచవరం వాకర్స్ అసోసియేషన్ ఈ తరహా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మాచవరం వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు, అధ్యక్షుడు సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రంగా శ్రీనివాస్, కోశాధికారి వెంకటేశ్వరరావు, మచవరం వాకర్స్ అసోసియేషన్ ఉమెన్స్ వింగ్ అధ్యక్షురాలు ఆర్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి యర్రాజీకు అథ్లెటిక్స్‌లో బంగారు పతకం

శాప్ చైర్మన్ రవినాయుడు అభినందనలు

విజయవాడ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడా పోటీలకు శాప్ చైర్మన్ రవినాయుడు హాజరయ్యారు. ఐవోఏ సభ్యులతో కలిసి అథ్లెటిక్స్ పోటీలను వీక్షించడంతో పాటు అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించిన ఏపీ అథ్లెట్ జ్యోతి యర్రాజీకు మెడల్ ప్రదాన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జ్యోతి యర్రాజీ విజయం తెలుగు ప్రజలకు గర్వకార ణమని, శాప్ తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.


యర్రాజీకు మెడల్ ప్రదాన చేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

అన్నవరపు రామస్వామికి సుసర్ల దక్షిణామూర్తి పురస్కారం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ సినీ సంగీత దర్శకులు సుసర్ల దక్షిణామూర్తి 104వ జయంతి సందర్భంగా ఆయన పురస్కారాన్ని సుప్రసిద్ధ వయోలిన్ విద్వాంసులు పద్మశ్రీ అన్నవరపు రామస్వామికి ఆదివారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై ప్రదానం చేశారు. సుసర్ల సంగీత వాహిని (హైదరాబాద్), తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త అధ్వర్యంలో జరిగిన పురస్కార సభలో చీఫ్ విప్ ఓఎస్‌డీ ప్రభాకర్, ఏబీ ఆనంద్ తదితరులు మాట్లాడుతూ పురస్కారాన్ని సముచితమైన వ్యక్తికి అందించి నిర్వాహకులు పురస్కార గౌరవాన్ని మరింత పెంచారన్నారు. పురస్కార స్వీకర్త అన్నవరపు మాట్లాడుతూ, సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రుల శిష్యులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు తమ గురుదేవులని, ఆ గురుకృపే తననింతటి వాడిని చేసిందన్నారు. అనంతరం సుసర్ల సంగీత దర్శకత్వంలోని చిత్రాల పాటలను స్వాతి, రజని, షబన, మల్లీశ్వరి, డేవిడ్‌రాజు, అయ్యప్పన్, రసూల్‌బాబు, మస్తాన్‌వలిలు సుసర్లవారికి నీరాజనాలర్పిస్తూ శ్రావ్యంగా పాడి వినిపించారు.


సుసర్ల దక్షిణామూర్తి పురస్కారం అందుకుంటున్న అన్నవరపు రామస్వామి

క్రీడల్లో రాష్ట్ర కీర్తిని ఇనుమడింప చేయాలి

● సీపీ ఎస్.వి.రాజశేఖర్ బాబు

గుణదల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్లాలమ్ కె-1 విభాగంలో జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన నాగిడి గాయత్రిని సీపీ ఎస్.వి.రాజశేఖర్ బాబు అభినందించారు. నాగాయలంకకు చెందిన నాగిడి గాయత్రి రిషీకేష్‌లో జరిగిన 38వ జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొని కెనాయ్ స్లాలమ్ కె-1 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి ఆదివారం నగరానికి చేరుకుని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబును మర్యాద పూర్వకంగా కలిసిన నాగిడి గాయత్రిని ఆయన అభినందించి, సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. క్రీడా కారిణి గాయత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాను స్థాయికి చేరుకోవడానికి పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తిప్పిరెడ్డి శివారెడ్డి ఇచ్చిన శిక్షణ ప్రధానమన్నారు. ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజి, పారిశ్రామికవేత్త అప్పికట్ల అప్పారావు మరికొంతమంది దాతలు, ప్రభుత్వ ప్రోత్సాహమే కారణమన్నారు. తప్పకుండా ఏషియన్ గేమ్స్‌లోనూ ఓలింపిక్‌లో పతకాలు సాధిస్తానన్నారు. కార్యక్రమంలో గాయత్రి తల్లిదండ్రులు, ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజి, హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గాయత్రిని అభినందిస్తున్న సీపీ ఎస్.వి.రాజశేఖర్ బాబు

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

పటమట/ఆటోనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలపై పోరాటం చేస్తానని ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ (రాజ) అన్నారు. 10వ డివిజన్‌లో ఫన్ టైమ్స్ క్లబ్‌లో ఆదివారం వాకర్స్‌ను ఆయన, గద్దె క్రాంతి కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. తొలి ప్రాధాన్యత ఓటును తనకు వేయాలని అభ్యర్థించారు. గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ యువత చేతిలో ఉందన్నారు. యువతకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో దేవినేని అపర్ణ, జాస్తి సాంబశివ రావు, కిలారు శివాజీ, బొర్రా గాంధీ, చెన్నుపాటి గాంధీ, కొసరాజు విజయబాబు, వేమూరి సాంబశివరావు, కోనేరు రాజేష్, అట్లూరి సుమ, చలసాని వాసు తదితరలుఁ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్

స్టేడియంలో...

లబ్బీపేట, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా కోరారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలోని వాకర్స్‌ను ఆదివారం ఉదయం గద్దె క్రాంతి కుమార్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఆలపాటిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

విద్యాధరపురం,ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని 39వ డివిజన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. సోమవారం నుంచి డివిజన్‌లో పర్యటించి, కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ తెలిపారు. కార్యక్రమంలో ఎన్.వీర్రాజు, రేగళ్ల లక్ష్మణ్, ఎన్.రాజీవ్ కృష్ణ, పచ్చిపులుసు శివప్రసాద్, గన్నవరం శ్రీనివాస్, లింగం శివప్రసాద్ పాల్గొన్నారు.

కుక్కల బెడదతో బెంబేలు

● ప్రమాదాల బారిన వాహనచోదకులు, పాదచారులు ● పిల్లలు బయటకు వెళుతుంటే భయం గుప్పెట్లో తల్లిదండ్రులు

(పాతరాజరాజేశ్వరిపేట, ఆంధ్రజ్యోతి): నగరంలో కుక్కల బెడద రోజు రోజుకు పెరిగిపోతుంది. వీటికి అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ఆమడ దూరంలో ఉన్నారు. కుక్కలతో వాహనచోదకులు, పాదచారులు అల్లాడుతున్నారు. వీటి బెడద ఎప్పుడు తగ్గుముఖం పడుతుందోనని ఎదురుచూస్తున్నారు.

నగరంలోని 34, 35, 55, 56 డివిజన్‌లలో కుక్కలు అధికమయ్యాయి. 34వ డివిజన్ కేదారేశ్వరపేట జీరో లైన్ నుంచి 8వ లైన్ వరకు, 35వ డివిజన్‌లోని పెజ్జోనిపేట కట్టరోడ్డు, మసీదు సెంటర్, కొపెలవారి వీధి, పూర్ణానందంపేట, బాప్టిస్టుపాలెం వీధులలో, 55వ డివిజన్ వించిపేట, నైజాంగేట్ సెంటర్, ఎర్రకట్ట మసీదు సెంటర్, కంసాలిపేట, 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరిపేట, కర్మెల్ చర్చి రోడ్డులో కుక్కలతో ఈప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు, పాదచారులు అటుగా వెళ్లాలంటేనే భయపడుతున్నారు. కుక్కలన్నీ ఒక్కసారిగా వారి వెంటపడుతుండటంతో కంగారుపడి అదుపుతప్పి కిందపడిపోయి గాయాలపాలవుతున్నారు. ఇక చిన్నారులు రోడ్లపైకి వచ్చే పరిస్థితి లేదు. తల్లిదండ్రులు బేంబేలు చెందుతున్నారు. కుక్కల వల్ల అంటువ్యాధులు ప్రబలుతున్నాయని, చిన్నారులకు, వృద్ధులకు శ్వాసకోశ సమస్యలు వస్తాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రాణనష్టం జరిగితేగాని అధికారులు పాలకులు స్పందించారా? అని ప్రశ్నిస్తున్నారు.


పెజ్జోనిపేట కట్టరోడ్డుకు అడ్డంగా శునకాల స్వైరవిహారం

దుర్గగుడిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి) : మాఘపు ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రికి భక్తులు విశేష సంఖ్యలో తరలి వచ్చి కనకదుర్గమ్మ, మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేకువజామున జరిగిన ఖడ్గమాలార్చన, చండీహోమంలో భక్తులు పాల్గొన్నారు. లక్ష కుంకుమార్చనలో 27మంది పాల్గొనగా, అన్ని ఆర్జిత సేవలలో 350మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు శీఘ్రదర్శనం కల్పించడం కోసం అధికారులు క్యూలను నియంత్రించారు. మరోవైపు మాఘ ఆదివారం సందర్భంగా వేదపండితులు, అర్చకులు సూర్యోపాసనసేవ చేశారు ఆరుణపారాయణ, ఆదిత్యునికి అర్చన నిర్వహించారు

ఈనెల 12 న గిరి ప్రదక్షిణ..

ప్రతి పౌర్ణమినాడు జరిగే గిరిప్రదక్షిణ ఉత్సవాన్ని ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు ఈవో రామచంద్రమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డులోని టోల్ గేట్ వద్ద ఉన్న కామధేను అమ్మవారి ఆలయం వద్ద నుంచి గిరిప్రదక్షణ ప్రారంభమవుతుందన్నారు.

కనకదుర్గమ్మ డాక్యుమెంటరీ విడుదల

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ అమ్మవారి డాక్యుమెంటరీ విడుదలయింది. దుర్గామల్లేశ్వర దేవస్థానం వెబ్‌సైట్‌లో దీనిని పెట్టారు. వేల సంవత్సరాల క్రితం అమ్మవారు స్వయంభువుగా కనకదుర్గగా ఇక్కడ వెలిశారని ప్రతీతి. దుర్గమ ఉగ్రరూపాన్ని ఆనాడు ఆదిశంకరాచార్యులు తొలగించి ముగ్ధమనోహర సుందరరూపంలో ఉన్న అమ్మవారిని ఆహ్వానించారు. అప్పుడే ఆయన అమ్మవారి చెంతన శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించారు. నేటిక అదే శ్రీచక్రానికి పూజలు జరుగుతున్నాయి. దేవదాయశాఖ, దుర్గామల్లేశ్వర దేవస్థానం సంయుక్తంగా డాక్యుమెంటరీని రూపొందించాయి. ప్రతిరోజూ ఉదయం 3గంటలకు కృష్ణానది నుంచి బిందెతీర్థం, కవాట ఉద్ఘాటన, సుప్రభాతం, ఖడ్గమాల అర్చన దగ్గర్నుంచి రోజూ జరిగే నివేదనలు, వేద పారాయణ, పూజలు, కల్యాణోత్సవాలు, ఊరేగింపులు, గిరిప్రదక్షణ తదితర అంశాలతో సుమారు 30నిముషాల 27 సెకండ్ల నిడివిలో డాక్యుమెంటరీని తయారు చేశారు. పంచహారతులు, దసరా ఉత్సవాలు, భవానీ దీక్షలు, శాకంబరీ ఉత్సవాలు, కార్తీక మాస, ఉగాది, బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాలు, ఉపాలయాల విశేషాలతో పొందించారు. మాజీ ఈవో కేఎస్ రామారావు పర్యవేక్షణలో డాక్యుమెంటరీ తయారయింది.

22, 23న ఉచిత పుస్తకాల పంపిణీ

ఆటోనగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో 9 ఏళ్లుగా ఉచిత పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని, ఈనెల 22, 23 తేదీల్లో సర్వోత్తమ గ్రంథాలయంలో పుస్తకాలను పంపిణీ చేస్తామని సంఘ ప్రధాన కార్యదర్శి రావి శారద ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు

పాయకాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్పందన సేవా సమితి ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో స్పందన సేవా సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రి డాక్టర్ పి. నిఖిల్, పార్టీ నేతలు పాల్గొన్నారు. అలాగే విజయవాడ ఏసీ, ఫ్రిడ్జ్ టెక్నీషియన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆహ్వాన్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని రోగులకు ఉచితంగా మందులు అందజేశారు.


రోగులకు కళ్లజోళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా


వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు, హనుమత్ వాహన సేవ

కన్నుల పండువగా హనుమత్ వాహన సేవ, ఎదుర్కోల ఉత్సవం

వన్‌టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈనెల 13వ తేదీ వరకు ప్రతిరోజూ వివిధ వాహన సేవలు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో ఆదివారం హను మత్ వాహన సేవ, ఎదుర్కోల ఉత్సవాలను జరిగాయి. సోమవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు కృష్ణానది నుంచి మంగళవాయిద్యాలతో తీర్థకలశం తీసుకురావడం, నిత్యార్చన, లక్ష్మీనారాయణ హోమం, సహస్ర గులాబీలతో అర్చన, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయి, కల్యాణోత్సవంలో టీటీడీ వేదపండితుడు పల్లిమురారి వెంకట శివకుమార్ అవధాని భక్తులకు ఆశీస్సులు అంద జేశారు. ఈవో నాగం సన్యాసిరావు, ట్రస్టుబోర్డు ఛైర్మన్ గుడిపాటి పాపారావు, సభ్యుల పర్యవేక్షణలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

అందరినీ సన్మార్గంలో నడిపించేది క్రీస్తుమార్గం

వన్‌టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : క్రీస్తుమార్గం అందరినీ సన్మార్గంలో నడిపిస్తుందని బొండా రవితేజ అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఆదివారం జరిగిన మైమరచిపోండి క్రీస్తు ఆధ్యాత్మిక గీతాలాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యేసు క్రీస్తునామమున అందరికీ శుభాభినందనలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా బైబిల్ బోధనలు ఎంతో ప్రాచుర్యం పొందాయన్నారు. బండి ఐజాక్, శ్యామ్‌ల ఆధ్వర్యంలో ఎంఎం శ్రీలేఖ, జాన్ జబరాజ్, బన్నీ ప్రసాద్ ఆలాపించినక్రైస్తవ గీతాలు మైమరపించాయి. టీడీపీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బొండా రవితేజ

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

విద్యాధరపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ స్టవ్‌పై ఉన్న కళాయిలో మరుగుతున్న నూనె ఒంటిమీద పడి తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. విద్యాధరపురం కామకోటి నగర్ పార్థసారథి రోడ్డులో శ్రీరాం వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులతో ఉంటున్నాడు. అతని భార్య శ్రీరాం రామలక్ష్మి (60) ఈనెల 4న అప్పడాలు వేయడానికి స్టవ్‌పై కళాయిలో నూనె పోసి బయటకు వచ్చింది. కాసేపటి తరువాత వంటగదిలో నుంచి పొగలు రావడంతో లోపలికి వెళ్లిచూడగా మరగిన నూనె స్టవ్‌పై పడడంతో మంటలు లేచాయి దగ్గరగా ఉన్న ఆమె చీరకు అంటుకున్నాయి. నూనె కూడా ఆమె ముఖం, శరీరాలపై చిందింది. ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందటంతో భర్త వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాల పేరుతో టోకరా

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. అస్మిన్ అనే మహిళ న్యూ రాజ రాజేశ్వరిపేటలో నివాసం ఉంటుంది. హైదరాబాద్‌కు చెందిన అలీ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు ఉన్నాయని తాను ఇప్పిస్తానని మహిళను నమ్మించాడు. ఒక్కొక్కరికి రూ.3 లక్షలు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. దీంతో మహిళ స్థానికంగా ఉన్న 15 మందితో రూ. 45 లక్షలు ఇప్పించింది. డబ్బులు ఇచ్చి రెండేళ్లు అవుతున్నా ఉద్యోగాలు రాకపోవడం, డబ్బులు తిరిగి ఇవ్వడంలేదు. దాంతో మోసపోయామని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు గణితంలో మెలకువలు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గణితంలో ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శిస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ఠాగూర్ గ్రంథాలయం ప్రధాన గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి అన్నారు. చదువంటే మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో విద్యార్థులకు గణితంలో మెలకువలపై శిక్షణ నిర్వహించారు. మ్యాథ్స్ ఉపాధ్యాయుడు చలసాని సాంబశివరావు విద్యార్థులకు స్పీడ్ మ్యాథ్స్‌లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రాక్టీస్ చేయించారు.

జ్యోతి యర్రాజీకి అథ్లెటిక్స్‌లో బంగారు పతకం

శాప్ ఛైర్మన్ రవినాయుడు అభినందనలు

విజయవాడ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడా పోటీలకు శాప్ ఛైర్మన్ రవినాయుడు హాజరయ్యారు. ఐవోఏ సభ్యులతో కలిసి అథ్లెటిక్స్ పోటీలను వీక్షించడంతో పాటు అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించిన ఏపీ అథ్లెట్ జ్యోతి యర్రాజీకు మెడల్ ప్రదాన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతి యర్రాజీ విజయం తెలుగు ప్రజలకు గర్వకారణమని, శాప్ తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.


యర్రాజీకు మెడల్ ప్రదాన చేస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే నివారణ సాధ్యం

హెచ్‌సీజీ కేన్సర్ ఆసుపత్రి ప్రతినిధి అంజిబాబు

గుణదల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎటువంటి రోగాన్ని అయినా ప్రాథమిక దశలోనే పసిగట్టి వైద్యుని సలహా సూచనల మేరకు ఆహారం, మందులు వాడుతే ప్రాణాపాయం ఉండదని హెచ్‌సీజీ కేన్సర్ ఆసుపత్రి ప్రతినిధి అంజిబాబు అన్నారు. ఒకటో డివిజన్ పరిధిలోని హెచ్‌సీజీ క్యేన్సర్ ఆసుపత్రి, మాచవరం వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. గర్భాశయ పరీక్షతోపాటు పలు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. మాచవరం, గుణదల పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన 120 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తున్నాయని, తద్వారా చాలా మంది అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంట్లో తయారు చేసిన ఆహారం ఎంతో శ్రేష్టం అన్నారు. బయట ఏదో తప్పని సరైనప్పుడు తప్ప ఇతర సమయాల్లో ఇంటి ఆహారం తీసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనారోగ్యం బారిన పడ్డ తర్వాత శ్రద్ధ తీసుకోవడం కాదని ప్రతి ఒక్కరూ వారి వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడంతోపాటు శరీరానికి వ్యాయామం కూడా చాలా అవసరమన్నారు. మాచవరం వాకర్స్ అసోసియేషన్ ఈ తరహా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అబినందనీయం అన్నారు. కార్యక్రమంలో మాచవరం వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు, అధ్యక్షుడు సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రంగా శ్రీనివాస్, కోశాధికారి వెంకటేశ్వరరావు, మచవరం వాకర్స్ అసోసియేషన్ ఉమెన్స్ వింగ్ అధ్యక్షురాలు ఆర్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


హెచ్‌సీజీ కేన్సర్ ఆసుపత్రిలో నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అన్నవరపు రామస్వామికి సుసర్ల దక్షిణామూర్తి పురస్కారం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ సినీ సంగీత దర్శకులు సుసర్ల దక్షిణామూర్తి 104వ జయంతి సందర్భంగా ఆయన పురస్కారాన్ని సుప్రసిద్ధ వయోలిన్ విద్వాంసులు పద్మశ్రీ అన్నవరపు రామస్వామికి ఆదివారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై ప్రదానం చేశారు. సుసర్ల సంగీత వాహిని (హైదరాబాద్), తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త అధ్వర్యంలో జరిగిన పురస్కార సభలో చీఫ్ విప్ ఓఎస్‌డీ ప్రభాకర్, ఏబీ ఆనంద్ తదితరులు మాట్లాడుతూ పురస్కారాన్ని సముచితమైన వ్యక్తికి అందించి నిర్వాహకులు పురస్కార గౌరవాన్ని మరింత పెంచారన్నారు. పురస్కార స్వీకర్త అన్నవరపు మాట్లాడుతూ, సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రుల శిష్యులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు తమ గురుదేవులని, ఆ గురుకృపే తననింతటి వాడిని చేసిందన్నారు. అనంతరం సుసర్ల సంగీత దర్శకత్వంలోని చిత్రాల పాటలను స్వాతి, రజని, షబన, మల్లీశ్వరి, డేవిడ్‌రాజు, అయ్యప్పన్, రసూల్‌బాబు, మస్తాన్‌వలిలు సుసర్లవారికి నీరాజనాలర్పిస్తూ శ్రావ్యంగా పాడి వినిపించారు.


దక్షిణామూర్తి పురస్కారం అందుకుంటున్న అన్నవరపు రామస్వామి

ఎన్టీఆర్ గ్రామీణం

● జగ్గయ్యపేట ● నందిగామ ● తిరువూరు ● మైలవరం

శుకశ్యామలాంబకు ప్రత్యేక అలంకరణ

నందిగామ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నందిగామలో వేంచేసి యున్న శుకశ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దండిభట్ల బాలకృష్ణశాస్త్రి, ముదిగొండ శశాంకశర్మ, సన్నిధానం కిషోర్‌శర్మ, యడవల్లి సాయిప్రసాద్‌శర్మ, బసవయ్యశర్మల ఆధ్వర్యంలో పూజలు హోమాలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీశుక శ్యామలాంబ అమ్మవారు

అధ్వాన రహదారితో అవస్థలు

● రాయనపాడు రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సిందే.. ● పట్టించుకోని అధికారులు

రాయనపాడు వెళ్లే రోడ్డు భారీ గోతులతో అధ్వానంగా తయారైంది. దీంతో వాహన చోదకులు ఈ రహదారిపై ప్రయాణించాలంటే సర్కస్ ఫీట్లు చేయక తప్పడం లేదు. ఆ గోతుల వల్ల వాహనదారుల నడుములు గుల్ల గుల్ల అవుతున్నాయి. తక్షణ మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి - గొల్లపూడి): విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి రాయనపాడు వెళ్లే రోడ్డు భారీ గోతులతో అధ్వానంగా తయారైంది. ఈ రహదారిలో ప్రతి రోజూ వేల సంఖ్యలో వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రాయనపాడు రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో పని చేసే సుమారు 4 వేల మంది ఉద్యోగులు, రైల్వే స్టేషన్ ప్రయాణికులు, పైడూరుపాడు, కవులూరు తదితర గ్రామాలకు ప్రజలు ఈరోడ్డు మీదుగానే ప్రయాణిస్తుంటారు. ఇటీవల బుడమేరుకు వచ్చిన వరదల కారణంగా రాయనపాడు రైల్వే గేటు వద్ద రహదారి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో వాహనచోదకులు ఈ రహదారిపై ప్రయాణించాటంటే సర్కస్ ఫీట్లు చేయక తప్పడం లేదు. హైవే నుంచి రాయనపాడు వరకు గల రహదారికి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రాయనపాడు రహదారి



అశోక్‌నగర్ వద్ద ధ్వంసమైన రహదారి

పూర్తిగా ధ్వంసమైంది

రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఆర్ అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రహదారి వేయాలి. మరికొద్ది రోజులు ఇలానే ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తే ప్రయాణికులతో పాటు వాహనచోదకులు ఆసుపత్రి పాలు కావడం ఖాయం.



కలపాల రాజేష్, రాయనపాడు ఉప సర్పంచ్

వాహనాలు గుల్లవుతున్నాయి


గోతులమయంగా మారిన రహదారిపై వాహనాలు తిప్పడం వల్ల అవి కాస్త గుల్ల గుల్ల అవుతున్నాయి. తోలిన సంపాదన కాస్త పాడవుతున్న వాహనాల మరమ్మతులకే ఖర్చు చేస్తున్నాం.



డి.కృష్ణ, ఆటో డ్రైవర్

అడుగుకో గొయ్యి

ఈరోడ్డులో అడుగుకో గొయ్యి ఏర్పడింది. ఆ గోతుల వల్ల వాహనదారుల నడుములు గుల్ల గుల్ల అవుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈరహదారి దుస్థితిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.



వెంపాటి శివాజీ

పక్షం రోజుల తర్వాత మరమ్మతులు చేయిస్తాం

మరో పక్షం రోజుల తర్వాత రహదారికి మరమ్మతులు చేయిస్తాం. ప్రస్తుతం కవులూరు, కట్టుబడిపాలెం వైపు పనులు చేయిస్తున్నాం. పైడూరుపాడు,రాయనపాడు, నల్లకుంట వరకు మరమ్మతులు చేయాల్సి ఉంది.

కె.ప్రకాశరావు, ఆర్అండ్‌బీ డీఈ

13న టెండర్ కం బహిరంగ వేలం

నందిగామ రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అంబారుపేట గ్రామంలోని సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో అమ్మవారి ఫోటోఫ్రేమ్, స్టిక్కర్లు, పొంగళి షెడ్డు హక్కుకు ఈ నెల 13న ఉదయం 11 గంటలకు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఈవో హరిగోపీనాథ్ ఆదివారం తెలిపారు. ఈ వేలంపాటల్లో ఆసక్తికలవారు పాల్గొనాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మోసం

జగ్గయ్యపేట రూరల్: ఏటీఎమ్‌లో డబ్బులు డ్రా చేస్తానని చెప్పి మోసం చేసి రూ. 31వేలు తీసిన గుర్తు తెలియని వ్యక్తి ఉదంతం చిల్లకల్లులో వెలుగు చూసింది. ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన బండారు భాస్కరరావు చిల్లకల్లులోని తన అల్లుడి ఇంటికి వచ్చాడు. శనివారం డబ్బులు అవసరమై కార్డుతో సెంటర్‌లోని ఏటీఎమ్‌లో చూడగా నగదు రాకపోవటంతో పక్కనే ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో యత్నించినా అక్కడ సైతం డబ్బులు రాలేదు. ఆ సమయంలో అక్కడే ఉన్న గుర్తు తెలియని వ్యక్తి డబ్బులు డ్రా చేసి ఇస్తానని చెప్పి పిన్ నంబరు తెలుసుకుని డబ్బులు రావటం లేదని చెప్పి మరొక కార్డు ఇచ్చి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం మరోసారి డ్రా చేద్దామనుకునే సమయంలో ఫోన్‌లో మూడు దఫాల వారిగా రూ. 31వేలు డ్రా చేసినట్టు మెసేజ్ రావటంతో ఖంగుతిన్న భాస్కరరావు తాను మోసపోయినట్టు తెలుసుకుని బ్యాంకు అధికారులు, పోలీసులను ఆశ్రయించారు. సీసీ ఫుటేజ్ పరిశీలించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

తిరుపతమ్మకు ప్రత్యేక పూజలు

పెనుగంచిప్రోలు: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి పీఎస్ వివేక్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇంటిలిజెన్స్ ఎస్పై ఎస్‌వీడీ ప్రసాద్ ఆదివారం తిరుపతమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



ఆహ్వాన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఉత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

నందిగామ రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించనున్న 72వ శ్రీరామ కోటి మహోత్సవాల ఆహ్వాన కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారామ నామ సంకీర్తన సంఘం అధ్యక్షుడు దుడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ మార్చి ఆరో తేదీ నుంచి ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

నందిగామ రూరల్: దాములూరు గ్రామంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో ఆదివారం విజయవాడకు చెందిన భవానీ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు దిలీప్‌కుమార్, కోమలిలు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ గాదెల వెంకట రామారావు, నాయకులు నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, సిద్ధార్థ, పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం : చలసాని

రెడ్డిగూడెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ ధ్యేయమని ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కొత్త రెడ్డిగూడెంలో ఆదివారం యూనియన్ ఫంక్షన్ హాల్లో వజ్రోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వరదల్లో విజయవాడ ప్లాంట్ మునిగిపోయినా పాల సేకరణ కాని, సరఫరా కాని ఆగకుండా అందరం ఐక్యంగా ముందుకు సాగామన్నారు. ఈనెల 11న ప్రతి పల్లెలో 60 ఏళ్ల వేడుకలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. బోర్డు సభ్యుడు ఉయ్యూరు అంజిరెడ్డి, వై.అప్పిరెడ్డి, ఎ.తిరుమల దేవి, కె.చంద్రశేఖరరావు, కె.వరదానం, పి.గోపి, ఎస్.రాంబాబు, కె.రాజబాబు సీతాకుమారి పాల్గొన్నారు.

లక్ష్మీపురం(తిరువూరు): కృష్ణామిల్క్ యూనియన్ 1965 పామర్రులో 250 లీటర్ల పాలసేకరణతో స్థాపించబడింది. ఈనెల 11వ తేదీకి 60 వసంతాలు పూర్తిచేసుకుంటుంది. కృష్ణమిల్క్ యూనియన్ ఛైర్మన్‌గా చలసాని ఆంజనేయులు బాధ్యతలు చేపట్టిన నాటినుంచి, సుమంగళి, ప్రతిభ, హెల్త్‌కార్డు, క్షీరబంధు, పశు ఆరోగ్యసంరక్షణ, యాక్సిడెంట్ కేర్‌ట్రస్టు వంటి పథకాలు అమలు జేస్తూ పాడిరైతులకు భరోసా కల్పిస్తున్నారు. పాలకేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న చలసాని ఆంజనేయులు

ఆలపాటి విజయమే లక్ష్యం

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజారిటీతో విజయం అందించాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కోరారు. ఆయన ఆదివారం రాత్రి తన నివాసంలో నిర్వహించిన పట్టణ టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. వెంకటేశ్వర్లు, పరిశీలకుడు చిన్నా, కిశోర్ పాల్గొన్నారు.

గంపలగూడెం: మండలంలోని ఊటుకూరులో మండల జనసేన అధ్యక్షులు చింతలపాటి వెంకటకృష్ణ అధ్యక్షతన ఆదివారం జనసేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలన్నారు. మండల జనసేన నాయకులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, మాధవరావు, బాలకృష్ణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: మండలంలోని గుమ్మడిదుర్రులో కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ (రాజ) విజయాన్ని కాంక్షిస్తూ గ్రామ టీడీపీ అధ్యక్షుడు పొన్నం బాలాజీ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ టీడీపీ నేతలు ఆదివారం మైలవరం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య

సాగునీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలి

నందిగామ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సాగునీటిని వృథా కానివ్వకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలని ఎన్ఎస్‌పీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం డీవీఆర్ బ్రాంచ్ కెనాల్‌పై పర్యటించిన ఆయన నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రైతులతో మాట్లాడిన ఆయన ప్రభుత్వ చొరవతో తెలంగాణా నుంచి నీరు విడుదలైందని తెలిపారు. నీటిని వృథా కానివ్వకుండా అవసరమైన పంటలకు మాత్రమే నీటిని వినియోగించాలని సూచించారు. ఈ ఏడాది వేసవిలో కాలువల మరమ్మతులు, కంప చెట్ల తొలగింపు కార్యక్రమాలు చేపడతామన్నారు. రాబోయే సీజన్ కాలువలను పటిష్ట పరిచి రైతులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో నీటి సంఘం సభ్యుడు మన్నెం శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

మద్యంషాపుల లాటరీ ప్రక్రియ వాయిదా

తిరువూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కులాల మద్యం షాపుల లాటరీ ప్రక్రియ తాత్కాలికంగా వాయిద వేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీన నిర్వహించాల్సిన మద్యం షాపుల లాటరీ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా వేశారన్నారు. త్వరలోనే లాటరీ నిర్వహించే తేదీని వెల్లడిస్తామని సీఐ తన ప్రకటనలో పేర్కొన్నారు.

పేకాట శిబిరాలపై దాడి

విస్సన్నపేట: మండలంలోని ఎన్టీఆర్ కాలనీ, కలగర రామచంద్రాపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఎన్టీఆర్ కాలనీలో 4 గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,450లు, రామచంద్రాపురంలో నలుగుర్ని అదుపులోకి తీసుకుని రూ.2,230లు నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆగని ఆక్రమణలు

విస్సన్నపేట: పుట్రేల రోడ్డు జాతీయరహదారి, సత్తుపల్లి రోడ్డు ఊర చెరువు గట్టుపై అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఊర చెరువు గట్టుపై ఆదివారం రేకుల షెడ్డు నిర్మాణం కొనసాగుతోంది. అయితే ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తమ పరిధి కాదు అంటే తమ పరిధి కాదని నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి.

రహదారికి మరమ్మతులు

వత్సవాయి: బోనకల్లు వెళ్లే రహదారిపై ఏర్పడిన గోతులకు ఎస్సై ఉమామహేశ్వరరావు తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు.

హిందీ పరీక్షలకు 87 మంది హాజరు

తిరువూరు : దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందీ పరీక్షల రెండో రోజైన ఆదివారం 87 మంది విద్యార్థులు హాజరయ్యారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



1999-2000 టెన్త్ బ్యాచ్

జి.కొండూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వెలగలేరు శ్రీ చనమోలు పకీర్రాయుడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000లో టెన్త్ చదివిన బ్యాచ్ 25 ఏళ్ల తర్వాత పాఠశాల ఆవరణలో ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఆనాటి తరగతి గదులను, మధుర స్మృతులను జ్ఞాపకం తెచ్చుకొని భావోద్వేగానికి లోనయ్యారు. ఆనాటి అల్లరి చేష్టలను, ఆటలను గుర్తు చేసుకుంటూ ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు. నాటి గురువులను ఘనంగా సత్కరించారు. తమ ఉన్నతికి కారణమైన పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

ఆర్థిక సాయం

మైలవరం: మైలవరంలోని ఆదాంపురం గ్రామానికి చెందిన బూరగ రత్తయ్యకు క్యాన్సర్ వైద్య సాయం కింద రూ.10 వేలను ఆదాంపురం సంఘ సభ్యులు ఆదివారం అందించారు. ఏసుపాదం, రవికుమార్ వసంతరావు, జాన్ మాస్టర్, శ్యామ్‌పాల్గొన్నారు.

తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు లంక లితీష్ ఆధ్వర్యంలో ఆదివారం మైలవరం తోకల బాలశ్రీను, లక్ష్మికాంతమ్మల కుటుంబాలను టీడీపీ నేతలు పరామర్శించి ఆర్థికసాయం అందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్లో ఆదివారం పోలీసులు గుర్తు తెలియని 40 ఏళ్ల వయస్సు ఉన్న ఒక వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. సుమారు 5.5 అడుగుల ఎత్తు, నలుపు జుట్టు, ఖాకీ కలర్ షర్టు, బ్లూ , నలుపు రంగు గల ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఆయన ఆచూకీ తెలిసిన వారు 9440627084కు లేదా 9059121109కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

వెబ్ సీరీస్ షూటింగ్ ప్రారంభం

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పెనుగంచిప్రోలులో తిరుపతమ్మ దేవస్థానం వద్ద 'నాన్న - నేను' వెబ్ సీరీస్ షూటింగ్‌ను మాజీమంత్రి నెట్టెం రఘురాం ఆదివారం ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టి ప్రారంభించారు. గ్రామానికి చెందిన తిరుపతమ్మ దేవస్థాన మాజీ ఛైర్మన్, ఆధ్యాత్మిక వేత్త ప్రముఖుడు వాసిరెడ్డి బెనర్జీ దీనిలో తండ్రి పాత్రను పోషిస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన వేణు మిరియాల దర్శకత్వంలో నిర్మితమవుతోంది. ఈ వెబ్ సిరీస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు వేగినేటి గోపాలకృష్ణ మూర్తి, కాకాని కోటేశ్వరరావు, కాకాని శ్రీనివాసరావు, నూతులపాటి చెన్నకేశవరావు, నలమోలు ప్రసాద్, వెంకయ్య పాల్గొన్నారు.



వెబ్ సిరీస్‌ను ప్రారంభిస్తున్న నెట్టెం రఘురాం

వాసవీభవన్ నిర్మాణానికి విరాళాల సేకరణ

గంపలగూడెం: ఊటుకూరులో వాసవీభవన్ నిర్మాణానికి విరాళాలు స్వీకరించడం ఆదివారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యులు పుల్లారావు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఊటుకూరుకు చెందిన ప్రసాద్‌బాబ్జి రెండుసెంట్ల స్థలం, సర్వేశ్వరరావు రూ.25వేలు, నాగేంద్రరావు రూ.25వేలు, మురళీమోహన్ రూ.30వేలు విరాళాలు అందించినట్టు కమిటీ తెలిపింది.

లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న మంత్రి

జగ్గయ్యపేట రూరల్ : వేదాద్రి యోగానంద లక్ష్మీనరసింహ స్వామిని దేవాదాయశాఖ మంత్రి వివేక్ దంపతులు ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. పూజల అనంతరం ఈవో సురేష్‌బాబు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్ర పటం అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

వేదాద్రి గ్రామంలోని యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామానికి చెందిన వెంకటకృష్ణారావు, చంద్రకళ దంపతులు రూ. 10,001లు విరాళంగా అందించారని ఈవో సురేష్‌బాబు తెలిపారు. దాతలకు పూజల అనంతరం స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్ర పటం అందజేశారు.

బ్యాంకు యాజమాన్య నిర్లక్ష్యానికి జరిమానా

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రుణం తీసుకుని చెల్లించినా డాక్యుమెంట్లు రుణగ్రహీతకు తిరిగి ఇవ్వటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన జగ్గయ్యపేట ఎస్‌బీఐ శాఖకు రూ.లక్ష రూపాయాల జరిమానాతో పాటు, రూ.5 వేలు కోర్టు ఖర్చుల కింద ఇవ్వాలని వినియోగదారుల ఫోరం తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళ్తే వత్సవాయి మండల తహసీల్దార్‌గా పనిచేసి రిటైరైన బోజరాజు 2002లో తన ఇంటి స్థలం డాక్యుమెంట్లు తాకట్టు పెట్టి రూ.2,00,000లు రుణం తీసుకున్నాడు. ఆ రుణం చెల్లించిన తర్వాత కూడా బ్యాంకు అధికారులు తన ఒరిజినల్ డాక్యుమెంట్లు ఇవ్వకుండా బాధ్యతా రాహిత్యంతో వ్యవహరించారు. దీంతో 2019లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవటంతో హైదరాబాద్‌లో కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించాడు. ఆ కోర్టు తహసీల్దార్ డాక్యుమెంట్లు ఇవ్వాలని ఆదేశించింది. అయినా బ్యాంకు అధికారులు డూప్లికేట్ కాపీలు ఇస్తామని చెప్పటంతో బోజరాజు కృష్ణా జిల్లా కన్స్యూమర్ కోర్టులో సవాల్ చేశారు. తనకు బ్యాంకు నుంచి పరిహారం ఇప్పించాలని కోరుతూ నవంబరు 10, 2022న కోరారు. జిల్లా వినియోగదారుల ఫోరం విచారణ జరిపి గత డిసెంబరు 10న రిటైర్డ్ తహసీల్దార్‌కు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని, పురపాలకసంఘం నుంచి ప్లాన్ అప్రూవల్ సందర్భంగా ఇచ ఇచ్చిన డాక్యుమెంట్లు సర్టిఫైడ్ కాపీలను ఇవ్వాలని ఆదేశించింది. బ్యాంకు అధికారులు రెండు రోజుల క్రితం బాధితుడికి పరిహారాన్ని చెక్ రూపంలో అందించి, సర్టిఫైడ్ కాపీలను అందజేశారు.



బోజరాజు

నగదు, నిత్యావసరాల పంపిణీ

నందిగామరూరల్: ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో గుండెజబ్బుతో బాధపడుతున్న సావిత్రమ్మకు రూ. 18 వేల నగదు, బియ్యం, నిత్యావసర వస్తువులను ఆదివారం అందజేశారు. సంఘ నాయకులు సత్యం, యేచూరు రాము, నాగేశ్వరరావు, పబ్బతి సీతారాం గుప్త, ఊటుకూరు సత్యనారాయణ, మహంకాళి చంద్రశేఖర్, కొప్పు మురళీ, పబ్బతి కిషోర్, పవన్‌కుమార్, సత్యంబాబు, ఆంజనేయులు, పాల్గొన్నారు.